సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య

చిన్నారులు తమ సృజనకు పదునుపెట్టారు. చిట్టిచేతులతో మట్టి గణపతి ప్రతిమలను రూపొందించి మురిసిపోయారు. - 8లో



పెదఖండేపల్లి రోడ్డుకు రూ.2కోట్లు మంజూరు

ఎదఖండేపల్లి గ్రామస్తుల రోడ్డు కష్టాలు కొద్దిరోజుల్లో తొలగనున్నాయి. - 8లో



20 నుంచి ఉక్కు రక్షణ యాత్ర

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 20 నుంచి 25 వరకు ఉక్కు రక్షణ యాత్రను సీపీఎం తలపెట్టింది. - 8లో

న్యూస్‌రీల్

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి



డీఎస్పీ మురళీధర్

పార్వతీపురం టౌన్: గణపతి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరని పార్వతీపురం డీఎస్పీ జి. మురళీధర్ అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్లు, మండపాల ఏర్పాటు, కమిటీ సభ్యుల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ప్రతి మండపంలో ఫస్ట్‌ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీలను తెలియజేయాలన్నారు. మండపాల వద్ద అధిక శబ్దాలు చేసే బాక్సులను ఉంచరాదన్నారు. సంప్రదాయ ప్రకారమే ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.

చెన్నై వెళ్లి పింఛన్ పంపిణీ



చెన్నై వెళ్లి కొత్తగా మంజూరైన పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ వెంకటరమణ

బలిజిపేట: మండలంలోని కె.చాకరాపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ వెంకటరమణ చెన్నై వెళ్లి అక్కడ ప్రభుత్వ టీబీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కె.సింహాచలంకు పింఛన్ అందజేశాడు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థ పేదలను ఆదుకుంటోందని, లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను సకాలంలో చేరుస్తోందని సర్పంచ్ కె.మోహనరావు తెలిపారు. వలంటీర్‌ను అభినందించారు.

కాపునేస్తంతో మహిళల్లో ఆర్థిక కాంతులు

- జిల్లాలో 1520 మందికి లబ్ధి
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.2.28 కోట్లు జమ
- కలెక్టర్ కార్యాలయంలో నమూనా చెక్కును విడుదలచేసిన జేసీ



లబ్ధిదారులకు కాపునేస్తం నమూనా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: వైఎస్సార్ కాపు నేస్తం కింద జిల్లాలో 1520 మంది లబ్ధిదారులకు రూ.2.28 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందని జేసీ గోవిందరావు తెలిపారు. నిడదవోలు వేదికగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపునేస్తం నాలుగో ఏడాది నిధులను శనివారం విడుదల చేశారు. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ, ఇతర అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వైఎస్సార్ కాపు నేస్తం కింద కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన 40 నుంచి 60 సంవత్సరాల వయస్సుగల మహిళలకు ఏడాదికి రూ.15వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. జిల్లాలో 1520 మందికి పథక ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కురుపాం నియోజవర్గంలోని గరుగుబిల్లి మండలానికి చెందిన 15 మంది, గుమ్మలక్ష్మీపురం-14, జియ్యమ్మవలస -84, కొమరాడ-6, కురుపాం- 21మంది, పాలకొండ నియోజకవర్గంలోని భామిని-56 మంది, పాలకొండ-74, పాలకొండ పట్టణం-98, సీతంపేట-6, వీరఘట్టం మండలానికి చెందిన 87 మంది లబ్ధిదారుల ఖాతాలకు నిధులు జమవుతాయన్నారు. అలాగే, పార్వతీపురం నియోజకవర్గంలోని బలిజిపేట నుంచి-133 మంది, పార్వతీపురం -166, పార్వతీపురం పట్టణం 62, సీతానగరం -149, సాలూరు నియోజకవర్గంలోని మక్కువ మండలం నుంచి 53 మంది, పాచిపెంట-214, సాలూరు-41, సాలూరు పట్టణానికి చెందిన 202 మందికి ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ఈ సందర్భంగా నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్పర్సన్ రంగుముద్రి రమాదేవి, కళింగ వైశ్యకార్పొరేషన్ డైరెక్టర్ మెహర్‌ప్రసాద్, గాండ్ల తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ వెంకటరమణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతి తిరుపతి, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, బీసీ కార్పొరేషన్ ఏఈఓ గోపి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2020-21	1362	2.043
2021-22	1344	2.016
2022-23	1429	2.144
2023-24	1520	2.28

గతంలో ఎవరూ గుర్తించలేదు



గతంలో ఏ ప్రభుత్వమూ మా కష్టాలను గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు నేస్తం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఈ డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకున్నాం. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గుడివాడ అప్పలనరసమ్మ, పార్వతీపురం

ఆర్థికోన్నతి దిశగా..



కాపు కులాల్లో ఉన్న పేదలను గుర్తించి ఏటా కాపు నేస్తం కింద రూ.15 వేలు ఆర్థికసాయం అందించడం గొప్ప విషయం. ఈ డబ్బు మా కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతోంది. ఇచ్చిన మాట నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిదే. జగనన్న మేలును ఎప్పుడూ మరవలేం.

– శ్రీనాథ్‌జ్యోతి, పార్వతీపురం

అండగా నిలిచారు



కాపు కులాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారు. ఏటా కాపునేస్తం కింద మాలాంటి పేద వర్గానికి రూ. 15వేలు క్రమం తప్పకుండా బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు. ఈ నగదు మా ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతోంది. మా లాంటి పేదలకు అండగా నిలిచిన జగనన్నకు కృతజ్ఞతలు.

– పడాల సావిత్రమ్మ, పార్వతీపురం

ప్రతి గడపకూ సంక్షేమం

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పాలన అందుతోందని, ప్రతిపల్లె అభివృద్ధి చెందుతోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను చంద్రబాబు నాయుడు మోసం చేశారన్నారు. ఎన్నికల హామీలు అమలుచేయకుండా ఆవేదనకు గురిచేశారన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు, 2014-2019 మధ్య మూడు శాఖలకు మంత్రిగా పనిచేసిన లోకేశ్‌లు తమ స్వార్థప్రయోజనాలకు పనిచేశారే తప్ప, ఏనాడూ ప్రజా సంక్షేమం కోసం ఆలోచించలేదన్నారు. లంచం ఇవ్వనిదే ఒక్క పథకమూ లబ్ధిదారులకు అందేదికాదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరలా ప్రజలను మోసం చేయడానికి టీడీపీ నాయకులు వస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు ఒక్కటేనన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ఓజోన్ ఉత్సవం

భూమిపై నివసించే సమస్త జీవరాసి మనుగడకు ఓజోన్‌పొర ఆవశ్యకతను సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల బాలికలు వినూత్నంగా తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

- సీతంపేట



సూర్యుడు, భూమి ఆకారంలో సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల బాలికల ఓజోన్ ఫార్ములా ఆకారం

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు చదురుగుడిలోని హుండీల ఆదాయన్ని శివాలయం వీధిలో ఉన్న అమ్మవారి కళ్యాణమండపంలో శనివారం లెక్కించారు. రూ.12,14,093ల నగదు, 15 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 242 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు గంధం లావణ్య, నక్కా జ్యోతి, బలివాడ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యన్నదానానికి రూ.లక్ష విరాళం

పైడితల్లి అమ్మవారి నిత్యన్నదానానికి విజయవాడకు చెందిన జగన్‌మోహన్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు శనివారం అందజేశారు. తన భార్య సుభాషిణి పేరుతో అమ్మవారికి అన్నదానం చేయాలని కోరారు. ఆయనకు వేదపండితులు వేదాశీస్సులు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ముఖ్యమంత్రి కృషి భేష్




సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరుచేసి, ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లోక్ సత్తా పార్టీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అభినందనలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. గాజులరేగ ప్రాంతంలో 70 ఎకరాల్లో రూ.500 కోట్ల అంచనా వ్యయంతో కళాశాల నిర్మాణాన్ని తలపెట్టడం అభినందనీయమన్నారు. 13,99,879 చదరపు అడుగులకు తొలిదశలో 1,50,000 చదరపు అడుగుల్లో రూ.99 కోట్ల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాలను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి కృషిని అభినందించాల్సిందేనన్నారు. 1979లో ఏర్పడిన జిల్లాకు ఇప్పటివరకు ప్రభుత్వ వైద్యకళాశాలలేని లోటును జగన్‌మోహన్‌రెడ్డి పూడ్చారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాట్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్.రాజు, భీంపల్లి భాస్కర్, ఇ.గోపీ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో పాఠశాలల నిధుల దోపిడీ!

- ప్రతి పాఠశాలకు స్పీడ్ మాథ్స్ కిట్లు ఇస్తామని ముందస్తుగా డబ్బులు వసూలు
- ప్రాథమిక పాఠశాలల నుంచి రూ.1650..
- యూపీ, ఉన్నత పాఠశాలల నుంచి రూ.2,250 చొప్పున వసూలు
- ఉత్తరాంధ్ర జిల్లాలోని సుమారు 8,500 పాఠశాలల నుంచి సుమారు రూ.1.70 కోట్ల దోపిడీ
- ఏ ఒక్క పాఠశాలకూ పుస్తకాలు ఇవ్వని వైనం
- 2017లో జరిగిన ఆడిట్‌లో పుస్తకాల కోసం ఖర్చుచేసినట్టు నమోదు



స్పీడ్ మాథ్స్‌కిట్లు రూ.1650లకు కొనుగోలు చేసినట్టు ఓ పాఠశాల ఆడిట్ బుక్‌లో నమోదైన దృశ్యం


వీరఘట్టం: టీడీపీ నేతల స్కామ్‌లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్‌స్కామ్‌లో ప్రజాధనాన్ని లూటీ చేసి జైలు మెట్లు ఎక్కగా.. తామేమీ తక్కువ కాదన్నట్టుగా టీడీపీ నాయకులు కూడా అదే తోవలో నడుస్తూ ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. 2016 సంవత్సరంలో అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అనుచరలమంటూ సర్కారుబడుల నిధులు రూ.1.70 కోట్ల వరకు దారిమళ్లించారంటూ కొందరు విద్యాశాఖ అధికారులు బహిరంగంగా చెబుతున్నారు.

పథకం ప్రకారం...

ఏటా ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకోసం స్కూల్ గ్రాంట్ విడుదల చేస్తుంది. ఈ నిధులపై కన్నేసిన టీడీపీ ముఠా సభ్యులు పథకం ప్రకారం ప్రతి పాఠశాలకు స్పీడ్ మాథ్స్ కిట్లు ఇస్తామని నమ్మబలికారు. మంత్రి గంటా శ్రీనివాసరావు అనుచరులమని, ఆయన ఆదేశాల మేరకు కరుణ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ పేరిట బుక్స్ పంపిణీ చేస్తున్నట్టు ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లి చెప్పారు. ప్రాథమిక పాఠశాల నుంచి రూ.1650, యూపీ, ఉన్నత పాఠశాలల నుంచి రూ.2,250 చొప్పున వసూలు చేశారు. ఏ ఒక్క పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేయలేదు.

2017లో జరిగిన ఆడిట్‌లో పాఠశాలకు పుస్తకాలు అందినట్టు రికార్డుల్లో ఖర్చులు నమోదు చేసి, అప్పటి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని సుమారు 8,500 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు రూ.1.70 కోట్లు కాజేశారు. 2016 ఫిబ్రవరి 23న పాఠశాల నిర్వహణ నిధుల ఖర్చులపై పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం ఎమ్మార్సీలో ఆడిట్ నిర్వహించారు. స్పీడ్ మాథ్స్ కిట్లు ఇస్తామని డబ్బులు తీసుకుని రసీదులు ఇచ్చారే తప్ప పుస్తకాలు ఇవ్వలేదని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆడిట్ అధికారులకు వివరించారు. అయినప్పటికీ హెచ్‌ఎంల మాటలను ఎవరూ లెక్కచేయలేదు. ఆ పుస్తకాలు ఎందుకు ఇవ్వలేదని ఏ ఒక్క ఉన్నతాధికారి ప్రశ్నించలేదు.

పాఠశాలలకు పుస్తకాలు ఇవ్వకుండానే అప్పటి విద్యాశాఖ మంత్రి అనుచరులమని చెప్పిన ముఠా నిధులు లూటీచేసినట్టు కొందరు హెచ్‌ఎంలు బహిరంగంగానే చెబుతున్నారు. కరుణ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ పేరిట కొందరు వ్యక్తులు ఎంఈఓలను కలవడం, అన్ని పాఠశాలలకు సంబంధించిన క్యాష్ రసీదులు అందజేసి డబ్బులు వసూలు చేశారని వాపోతున్నారు. మంత్రి పేరు చెప్పడంతో మండల విద్యాశాఖ అధికారులు నోరుమెదపలేక పోయారని వివరిస్తున్నారు. విచారణ జరిపితే పాఠశాలల నిధుల దోపిడీ వ్యవహారం బయటకు వస్తుందంటున్నారు.



వీరఘట్టంలోని ఓ పాఠశాలకు స్పీడ్ మాథ్స్ కిట్లకు ఇచ్చిన రూ.1650ల రసీదు

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఆస్పత్రిలో మృతి చెందిన రాము

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం పార్వతీపురం నుండి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీకొని కోండ్రు రాము అనే వ్యక్తి మృతి చెందాడని హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు. కోండ్రు రాము మెరకముడిదాం మండలం మర్రివలస గ్రామానికి చెందిన వాడని, మరుపల్లి గ్రామంలోని తన కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స పొందుతుండగా మరణించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువుల శాల దగ్ధం



కాలిన గాయాలతో ఆవు దూడలు

భామిని: మండలంలోని తాటిమానుగూడలో బిడ్డిక ఈశ్వరరావుకు చెందిన పశువుల పాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేగిన మంటలకు శాల కాలిపోయింది. ప్రమాదంలో ఒక మేక మృతి చెందింది. మరో 12 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. వీటిని రక్షించబోయి ఆదివాసీ మహిళ ఆరిక గౌరి గాయపడింది. శాలలో ఉన్న పాడి ఆవు, దూడలకు కూడా గాయాలయ్యాయి. వీఆర్‌ఓ రవికుమార్ ప్రమాద విషయం తెలుసుకొని నష్టాలు గుర్తించి అధికారులకు తెలిపారు. సంచార పశువైద్యశాలను రప్పించి గాయపడిన జీవాలకు వైద్యం చేయించారు. గౌరీని బాలేరు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న సీఎస్‌డీటీ మూర్తి

శృంగవరపుకోట: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎన్.వి.వి.ఎస్.మూర్తి రెండు దుకాణాల యజమానులపై శనివారం కేసులు నమోదు చేశారు. మండలంలో సంతగవిరమ్మపేట గ్రామంలో కిరాణా వ్యాపారులు మద్దుల శ్రీరామ్మూర్తి దుకాణం తనిఖీ చేయగా 177కిలోల పీడీఎస్ బియ్యం, అదే గ్రామానికి చెందిన కల్లూరి హరి దుకాణంలో 96కిలోల బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో వారిరువురిపై 6ఏ కేసులు నమోదు చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్టు చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



శ్రీను మృతదేహం

రాజాం సిటీ: గుర్తు తెలియని వాహనం ఢీకొని బండి శ్రీను(48) అనే వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన స్థానిక బొబ్బిలి రోడ్డులోని గ్యాస్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పెనుబాక గ్రామానికి చెందిన ఆయన స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఓ జ్యూట్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు నడుచుకుంటూ ఆయన వెళ్తుండగా గ్యాస్ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్రగాయమైంది. అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256

చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య



- చిట్టి చేతుల్లో వివిధ ఆకృతుల్లో ఒదిగిపోయిన బొజ్జగణపతి
- సాక్షి మీడియా గ్రూపు, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహణ
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన జేసీ, డీపీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు



కార్యక్రమానికి హాజరైన చిన్నారులు



మట్టి వినాయక ప్రతిమలను చేస్తున్న చిన్నారులు

పార్వతీపురంటౌన్: సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం సాగిన 'చిన్నారుల చేతుల్లో మట్టిగణపతి కార్యక్రమం' సందడిగా సాగింది. చిన్నారులకు అందజేసిన మట్టితో ఆదిదేవుడి ప్రతిమలను అందంగా తయారు చేశారు. వాటిని పదేపదే చూస్తూ మురిసిపోయారు. మా మంచి మట్టిగణపయ్య అంటూ చిరునవ్వులు చిందించారు. మట్టిగణపతినే పూజిద్దామన్న సందేశాన్నిచ్చారు. కార్యక్రమానికి జేసీ ఆర్.గోవిందరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి లోచర్ల రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జేసీ గోవిందరావు మాట్లాడుతూ భారీ వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారీస్, సింథటిక్ రంగులు వినియోగిస్తారని, వాటిని చెరువులు, వాగులు, నదులు, సముద్రంలో నిమజ్జనం చేసే సమయంలో నీరు, గాలి కలుషితమవుతోందని, జీవరాసులు నశించిపోతున్నాయన్నారు. ప్రతీఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకులను పూజించుకొని పండగ నిర్వహించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మట్టిగణపతి ప్రతిమలను అందంగా తయారుచేసిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ముందుగా వినాయకునిపై చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు అతిథులను అలరించాయి. కార్యక్రమంలో సాక్షి మీడియా గ్రూప్ సిబ్బంది ఎ.జయంత్‌కుమార్, డి.మహందాతనాయుడు, సీహెచ్ వరప్రసాద్, శంకరరావు, రామకృష్ణ, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

వి.లోకేష్, ఎం.రహాన (పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల), టి.అభిరామ్ (డీవీఎం స్కూల్), ఎ.హర్షవర్ధన్ (జీహెచ్‌ఎస్, పార్వతీపురం) ఆర్.అశ్విని (జీజీహెచ్‌ఎస్, పార్వతీపురం), జి.చరణ్‌తేజ (బీహెచ్‌ఎస్, పార్వతీపురం), టి.శ్యామ్‌దుర్గాప్రసాద్ (జీహెచ్‌ఎస్, పార్వతీపురం), టి.కావ్యశ్రీ (జీహెచ్‌ఎస్, పార్వతీపురం), బి.చిన్నమ్ములు (జీజీహెచ్‌ఎస్, పార్వతీపురం), బి.హేమంత్ కుమార్ (ఎంపీపీఎస్, పెదబొండపల్లి)

సాక్షి మీడియా గ్రూపునకు ధన్యవాదాలు



విద్యార్థి దశలోనే పిల్లలకు మట్టి వినాయకుని తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్న ఏపీ కాలుష్యనియంత్రణ మండలి, సాక్షి మీడియా గ్రూపునకు ధన్యవాదాలు. నదులు, సరస్సులు, చెరువుల్లో నుంచి సేకరించిన మట్టిలో ఔషధ గుణాలు ఉంటాయి. ఆ మట్టితో విగ్రహాలు తీయారు చేసి పూజిస్తే మంచి జరుగుతుంది. మట్టి గణపతుల తయారీపై శిక్షణ ఇవ్వడం అభినందనీయం. రానున్న రోజుల్లో సాక్షి మీడియా గ్రూపు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆశిస్తున్నాం.

– జిల్లా విద్యాశాఖాధికారి, ఎన్.ప్రేమ్‌కుమార్, పార్వతీపురం మన్యం

మట్టి గణపతినే పూజిద్దాం



పర్యావరణాన్ని పరిరక్షించేందుకే ప్రతీ ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలి. మన సంప్రదాయం ప్రకారం మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలి. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల జలచరాలకు హాని కలుగుతుంది. పర్యావరణానికి పెను ముప్పు. దీనిని మనమందరం అరికట్టాలి. మట్టి విగ్రహాలనే పూజించాలని సాక్షి మీడియా గ్రూపు విద్యార్థి దశనుంచే శిక్షణ ఇవ్వడం అభినందనీయం.

– లోచర్ల రమేష్, జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి, పార్వతీపురం మన్యం

చక్కని కార్యక్రమం



సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల తయారీ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇది చక్కని ఆలోచన. తెలుగు సంప్రదాయాలు మట్టి కొట్టుకుపోతున్న వేళలో మట్టితో వినాయక ప్రతిమలు తయారు చేసే కార్యక్రమం చేపట్టి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయం.

– ఆకుల రాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

మంచి శిక్షణ ఇచ్చారు



మట్టి గణపతుల తయారీపై పోటీలు నిర్వహిస్తున్నారని తెలిసి వచ్చాను. మట్టితో గణపతి ప్రతిమ తయారీపై ఇచ్చిన శిక్షణ బాగుంది. నేను మరో పదిమందికి శిక్షణ ఇస్తాను. మట్టి విగ్రహాలను వినియోగించాలని చెబుతాను.

– భరత్, జీహెచ్‌ఎస్, పార్వతీపురం

కొత్తగా ఉంది



మట్టితో వినాయక బొమ్మ తయారు చేయడం కొత్తగా అనిపించింది. 'సాక్షి' మీడియా అందించిన సూచనల ప్రకారం ప్రతిమను అందంగా తయారు చేయగలిగాను. మా తల్లిదండ్రులకు కూడా మట్టి ప్రతిమను పూజించాలని చెబుతాను. బహుమతి రావడం ఆనందంగా ఉంది.

– ఎం. రహాన, జీజీహెచ్‌ఎస్, పార్వతీపురం

ఆనందంగా ఉంది



మా అమ్మానాన్న, మా ఉపాధ్యాయులు హస్తకళకు అధిక ప్రాధాన్యమిస్తారు. ఆ ప్రావీణ్యంతోనే మట్టిగణపతిని అందంగా తయారుచేయగలిగాను. బహుమతి రావడం ఆనందంగా ఉంది. నేను మట్టితో తయారుచేసిన ప్రతిమనే ఇంటిలో పూజిస్తాం.

– వి.లోకేష్, ప్రథమ బహుమతి విజేత, పార్వతీపురం



విద్యార్థులకు మట్టిబొమ్మల తయారీపై శిక్షణ ఇస్తున్న క్రాఫ్ టీచర్ కాంచన



విజేతలతో జేసీ గోవిందరావు, డీపీఆర్‌ఓ రమేష్, కళాశాల సిబ్బంది

తల్లిని చంపిన తనయుడికి రిమాండ్

- కన్నతల్లిని క్రూర మృగంలా కడతేర్చాడు
- డీఎస్పీ శ్రీధర్
- నిందితుడికి రిమాండ్



నిందితుడు శ్రీనివాసరావును అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: జన్మనిచ్చిన తల్లిని క్రూర మృగంలా కన్నబిడ్డే దారుణంగా హతమార్చాడని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మండల కేంద్రంలోని వసంతుల వీధిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి కన్నతల్లిని కుమారుడే హత్య చేసిన సంగతి తెలిసిందే. అయితే హత్య చేసిన నిందితుడు రామభద్రపురం వీఆర్వో వద్ద లొంగిపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సీఐ తిరుమలరావు, ఎస్‌ఐలు సురేంద్రనాయుడు, జయంతిలతో కలిసి శనివారం డీఎస్పీ పి.శ్రీధర్ విలేకర్ల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామభద్రపురం గ్రామం వసంతుల వీధికి చెందిన ఉప్పల రమణమ్మ(75)కు ఆరుగురు సంతానం. వారిలో ఆఖరి సంతానం శ్రీనివాసరావుతో కలిసి ఉంటుంది. శ్రీనివాసరావు రామభద్రపురం జంక్షన్‌లో చిన్న టిఫిన్ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తూ మద్యానికి బానిసయ్యాడు. టిఫిన్ కొట్టు మీద వచ్చిన డబ్బులు రోజూ తాగేసి ఇంటికి వెళ్లేవాడు. ఆ డబ్బులు చాలక తల్లిని తాగేందుకు డబ్బులు అడుగుతూ రోజూ గొడవ పడేవాడు. తల్లి రోజూ మద్యం తాగొద్దని వారించేది. డబ్బుల్లేక ఇల్లు గడవడం లేదని నచ్చజెప్పేది. దీంతో శ్రీనివాసరావు రోజూ తనను తల్లి మందలిస్తుందని భావించి ఈ నెల 14న దుకాణం తెరవకుండా మద్యం తాగేందుకు రోజూలాగే తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బుల్లేవని చెప్పడంతో పింఛన్ డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టాడు. అయినా డబ్బులు తల్లి ఇవ్వకపోవడంతో అదే రోజు అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి పడుకున్న తల్లిని ఇంట్లో ఉన్న రాడ్డుతో తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంకా బతికే ఉందన్న అనుమానంతో రాడ్డు నోటిలో పెట్టి చేతితో తల్లి నాలుక లాగేశాడు. ఆ నాలుకను పేపరులో చుట్టి ఫ్యాంట్ జేబులో పెట్టి పోలీసులకు చూపాడు. ఎస్‌ఐ జయంతి దర్యాప్తు చేయగా సీఐ తిరుమలరావు విచారించి కేసు నమోదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'ఆశ్రమ' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో 8వ తరగతి చదువుతున్న ఎన్.నవీన్ కుమార్, ఏడో తరగతి చదువుతున్న ఎస్.త్రినాథ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గాసయ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు వంగర విద్యార్థులు



లాంగ్ జంప్ సాధన చేస్తున్న దేవకివాడ అశోక్



స్ప్రింట్ రన్ సాధన చేస్తున్న చందు

వంగర: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ – 14 లాంగ్ జంప్ విభాగంలో దేవకివాడ అశోక్, 60 మీటర్ల స్ప్రింట్‌రన్ విభాగంలో కొమరాపు చందు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. వీరికి ఎన్‌ఐఎస్ అథ్లెటిక్ కోచ్ నాచు గోవర్ధనరావు, పీఈటీ కవిత పాఠశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

పెదఖండేపల్లి రోడ్డుకు రూ.2కోట్లు మంజూరు



మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు చెబుతున్న గ్రామస్తులు

- మంత్రి బూడి, ఎమ్మెల్యే కడుబండికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

కొత్తవలస: పాలకులు మారారే తప్ప ఆ గ్రామానికి రహదారి మాత్రం వేయలేదు. దశాబ్దాల కాలం పాటూ ఆ గ్రామస్తులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషితో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు రూ.2 కోట్లు మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...ఎస్.కోట మండలంలోని అరుకు – విశాఖ రోడ్డులో రాజులకళ్లాల వద్ద జంక్షన్ నుంచి పెదఖండేపల్లికి వెళ్లే రోడ్డు అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉంది. సుమారు మూడు కిలో మీటర్ల రోడ్డులో పెద్ద పెద్ద రాళ్లు తేలిపోయి కనీసం నడిచేందుకు అవకాశం కూడా లేకుండా పోయింది. 1994 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మెటల్ రోడ్డుగా వేసి చేతులు దులిపేసుకుంది. గ్రామస్తులు తమ అవస్థలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తానని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు. విషయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి బూడి ముత్యాలనాయుడుకి వివరించి నిధుల మంజూరుకు కృషి చేశారు. రోడ్డును విస్తరిస్తూ బీటీ రోడ్డుగా మార్చేందుకు తక్షణమే రూ.2కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నిధులు మంజూరు చేసిన మంత్రి ముత్యాలనాయుడుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి శనివారం వచ్చిన మంత్రిని, స్థానిక ఎమ్మెల్యేని గ్రామస్తులు ప్రత్యేకంగా కలిసి ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్టు చైర్మన్ పి.రామకృష్ణ,,పార్టీ నాయకులు రంధి అనంత, సోంబాబు, పెదఖండేపల్లి గ్రామస్తులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

20నుంచి ఉక్కు రక్షణ యాత్ర



వాల్‌పోస్టరు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 20 నుండి 25వరకు శ్రీకాకుళం నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకు ఉక్కు రక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్ర వాల్‌పోస్టరును విడుదల చేశారు. పార్టీ నాయకులు శంకర్రావు, రమణ, వి.లక్ష్మి, పి.శంకర్ పాల్గొన్నారు.

కత్తి చూపించి.. బెదిరించి...

విజయనగరం క్రైమ్: ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని అటుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులు అడ్డగించి అతని వద్ద డబ్బులు లేకపోయేసరికి అతని వద్ద నున్న సెల్ లాక్కొని పరారయ్యారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జీఎస్‌టీయూ గోడౌన్స్ సమీపంలో రాత్రి విధులు నిర్వహించి కెఎల్.పురం వైపు శనివారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సింగంపల్లి రవి అనే వ్యక్తిని ఆర్‌టీఓ కార్యాలయం సమీపంలో బైక్ పై అటు నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులు చాకు చూపి బెదిరించారు. అతనివద్ద డబ్బులేవీ దొరక్కపోవడంతో చేతిలో ఉన్న సెల్‌ను లాక్కొన్నారు. బైక్ పై వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్న వారిని రవి పట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. దీంతో అతన్ని ఈడ్చుకుంటూ వెళ్లిపోయారు. దీంతో అతను తీవ్ర గా యలపాలయ్యాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.